


ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 7 సంచిక : 12 పుష్పం : 31-33 05-03-2002

**RAMANA BHASKARA**

**TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE**

PAGES : 20

**VOL : 7** **ISSUE : 12**

EDITOR
**P.S. RAMA RAJU**

EDITING
**P.H.V. SATYAVATHI**
(HYMA)

**SUBSCRIPTION**
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**

**ADDRESS**
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
**JINNURU - 534 265**
W.G.Dt., A.P.

**PUBLISHER**
P.S. RAMARAJU
LAKSHMI MODERN RICE MILL
**ULLAMPARRU - PALAKOL**
☎ 08814 - 24589, 24689

**PRINTER**
SHRIRAM GRAPHICS
BANK STREET - **PALAKOL**
☎ 08814 - 22438, 24278


## సాధన

సాధన లేక ప్రయత్నం సాధారణంగా రెండు రకాలుగా వుంటుంది. ఏదైనా ఒక వస్తువును క్రొత్తగా పొందుటకు సాధన (ప్రయత్నం) అవసరమవుతుంది; ఉదాహరణకు ఒక ఇల్లు క్రొత్తగా కట్టుటకు దానికి తగిన సాధన (ప్రయత్నం) చెయ్యాలి. రెండవ సందర్భములో ఉన్నదానిని పోగొట్టుకోవడానికి ప్రయత్నం అవసరం, అనగా ఒక ఇల్లు కూలగొట్టడానికి దానికి తగిన ప్రయత్నం కావాలి. జ్ఞాన మార్గంలో సాధన చేసి 'ఆత్మ'ను క్రొత్తగా పొందేప్రశ్నే లేదు. అది మన స్వరూపమే. క్రొత్తగా పొందినది కాలగర్భంలో నశిస్తుంది. దేహం పుట్టుకతోటి, దేహం మరణంతోటి సంబంధం లేకుండా, ఏవస్తువైతే సృష్టికి, మనకి ఆధారంగా వుందో అదే 'ఆత్మ'; అదే 'నిజమైన-నేను'. నశించే నామ, రూపాలలో నశించని తత్త్వమే ఆత్మ. కేవలం ఉన్న వస్తువు (ఆత్మ) అనుభవంలోనికి రావడం లేదు అంటే, సూర్యుని వెలుతురుకు మబ్బు అడ్డు వచ్చినట్లు, స్వరూపానుభూతికి 'అహంకారం' అడ్డుగా నిలుస్తోంది. మూలతలంపే అహంకారం, అదే చిజ్జడగ్రంథి, అదే జీవుడు. మూలతలంపు దేహంతో తాదాత్మ్యం చెందడం వల్ల జీవత్వం వస్తోంది; దేవుడు జీవుడవుతున్నాడు. మూలమైన ఆత్మకు, జడమైన శరీరానికి మధ్యన మూలతలంపు అడ్డుగా నిలుస్తోంది. ఆ మూలతలంపును (అహంకారాన్ని) నిశ్శేషముగా నశింపజేయుటయే సాధన గమ్యం. స్వరూపానుభూతికి జ్ఞానమార్గంలో వివేకమే సాధన. పక్షి ఎగురుటకు రెండు రెక్కలు ఎలాగైతే అవసరమో, ఆత్మసాక్షాత్కారానికి వివేకం, వైరాగ్యం అంతే అవసరం. వివేకము అనగా నిజమైన సుఖము, ఆనందము, శాంతి హృదయంలోనే వున్నదని, బాహ్యప్రపంచంలో అనగా విషయాలలో లేదనే ధృఢమైన నిశ్చయము కలిగి మనస్సు తన మూలాన్ని వీడక యుండుటయే వివేకము.

వైరాగ్యము అనగా బాహ్యవస్తువులనుండి, విషయ ప్రపంచమునుండి సుఖాన్ని శాంతిని ఆశించక పోవడం వైరాగ్యం.

సహజస్థితి అనగా హృదయంలో వున్న సత్యం 'నిజమైన-నేను'గా అనుభవంలోనికి రావడానికే సాధన అంతా. మనము ఏదిగా ఉన్నామో అదిగా వుండడానికే సాధన అంతా. గురువు చెప్పే ప్రతి మాటను చక్కగా అర్థం చేసుకొని, ఆచరణలో పెడితే మన సాధనలోని నాణ్యత పెరుగుతుంది. నిజమైన లబ్ది కలుగుతుంది. మన అస్థిత్వానికి పరమ ఆధార భూతమైన తత్త్వమే 'నిజమైన-నేను'. అంతర్ముఖులమై, వివేక, వైరాగ్యములద్వారా ఆత్మను స్వరూపంగా అనుభవంలోనికి తెచ్చుకొనుటయే మన జీవిత గమ్యం.


**చావలి సూర్యనారాయణమూర్తి**
టీచరు, **అమలాపురం**



**ఈ సంచికలో......** **సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు**

16-01-2002 కాశిపాడు ........ 3
03-02-2002 లక్కవరం ........ 9
17-02-2002 పోడూరు ........ 13


Visit us : www.srinannagaru.com

### రమణ భాస్కర పాఠకులకు మనవి !

దేశ, విదేశాలలో ఉన్న భక్తుల సౌకర్యార్థం సద్గురు శ్రీ నాన్నగారి పేరుమీద వెబ్‌సైట్ రిజిష్టర్ చేయబడినది. కావున భక్తులు ఈ వెబ్‌సైట్ ద్వారా శ్రీనాన్న గారి ప్రవచనములు మరియు ప్రోగ్రామ్‌ని తిలకించగలరు. వెబ్‌సైట్ అడ్రస్సు: www.srinannagaru.com

### సవరణ

సంచిక నెం.11 నందు ఎడిటోరియల్ రెండొవ పేజిలో పొరపాటుగా ప్రింటు అయిన పదాలను ఈ క్రింది సూచించిన విధంగా సవరించుకోగలరు.

| | తప్పు | సవరణ |
|---|---|---|
| 5వ లైను | **ధానస్థితి** | **ధ్యానస్థితి** |
| 7వ లైను | **మరుగుపరచడంలో** | **అనుభవంలోనికి తెచ్చుకోవటంలో** |
| 12వ లైను | **ధానించు** | **ధ్యానించు** |

# రమణభాస్కర

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, ది. 16-01-02, కాశిపాడు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

పరమేశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అని పరిపూర్ణమైన విశ్వాసం ముందు మనకు ఉండాలి. మనకు తెలిసినా, తెలియకపోయినా భగవంతుడు ఉన్నాడు. ఆయన ఉన్నాడు అనే సజీవమైన విశ్వాసం ముందు మనకు ఉండాలి, అది ముఖ్యం. మనం తెల్ల బట్టలు కట్టుకొన్నా, ఎర్ర బట్టలు కట్టుకొన్నా మనకు భక్తి, ప్రేమ ఉండాలి. భగవంతుని సంకల్పం ప్రకారమే ఈ జీవితయాత్ర నడుస్తోంది. అది మనకు అనుభవంలో లేదు. ఈ దేహం భూమి మీదకు ఏపని నిమిత్తం వచ్చిందో ఆపని పూర్తి అయ్యేవరకు ఈ దేహం ఉంటుంది, తరువాత ఈ దేహయాత్ర ముగిసిపోతుంది. దేహయాత్ర ముగిసిపోయింది అని కంగారుపడకు. పూర్వ జన్మ సంస్కారములనుబట్టి, వాసనలను బట్టి ఈ దేహం ఎలా వచ్చిందో అలాగే ఈ జన్మలో సంస్కారములను బట్టి రాబోయే జన్మ వస్తుంది. మనుషులు అందరూ ఒకే రకంగా ఉన్నారా? లేదు. దీనికి కారణం పూర్వజన్మ వాసనలు. ఇది అంతా మాయలో భాగమే. ఈ మాయ అంతా నాదే. అందువలన నాపాదాలను ఆశ్రయించి, నన్ను విశ్వసించి, నేను చెప్పిన మాటలు జాగ్రత్తగా శ్రవణంచేసి, నీ అహంకారమును సంతృప్తిపరచుకోకుండా నన్ను సంతృప్తిపరచటానికి నీవు పనిచేస్తూ ఉంటే నీకు నాకు ఏదైనా బేధం ఉంటే అది ఊడిపోతుంది అని పరమాత్మ చెపుతున్నాడు. మాయగుణాల రూపంలో ఉంటుంది. గుణాలను బట్టి మనస్సు మారుతూ ఉంటుంది. ఈ మాయలో నుండి బయటకు రావటం అంత తేలిక కాదు, చాలా కష్టమే. ఇది నా మాయ అందుచేత ఎవరైతే నాపాదాలను ఆశ్రయించి, నన్ను భజిస్తున్నారో, నా సంతృప్తి కోసం ఎవరైతే పనిచేస్తున్నారో వారికి మాయ దారి ఇస్తుంది. భగవంతుడు ఎంత పవిత్రంగా ఉన్నాడో, ఎంత ఏకాగ్రంగా ఉన్నాడో అలాగ నీ మనస్సు కూడా అంత పవిత్రమైతే, అంత ఏకాగ్రం అయితే ఆ మనస్సు ఊడిపోతుంది, లోపలఉన్న చైతన్యం నీకు తానుగా వ్యక్తమవుతుంది. మన మాటలో, తలంపులో, ప్రవర్తనలో నిగ్రహం ఉండాలి. నిన్ను నీవు ఎంతైతే నిగ్రహించుకొంటున్నావో, నియమించుకొంటున్నావో, సంస్కరించుకొంటున్నావో నీ హృదయంలో ఉన్న ఈశ్వరుడికి అంత సమీపంలోనికి వెళతావు. మనం సత్వగుణాన్ని నేర్చుకోవాలి. సత్వగుణం ఉన్నవారితో సహవాసం చేయాలి. తమోగుణం, రజోగుణం తగ్గించుకొంటూ సత్వగుణాన్ని అలవర్చుకొంటూ ఉంటే సత్వగుణం ఈశ్వరానుభవం పొందటానికి దారిచూపిస్తుంది. నీకు ఉన్న పొలంమీద, నీకు ఉన్న డబ్బుమీద ఉన్న నమ్మకం నా మీద లేదు. మీ ఆయన ఉద్యోగం చేస్తున్నాడు. ఆయన మీద ఉన్న నమ్మకం నీకు నామీద లేదు. నీకు నేను జ్ఞానం ఇవ్వాలా? నీవు సపోర్టులమీద బ్రతుకుచున్నావు. నీవు ఎలాగ బ్రతుకుచున్నావో నాకు తెలియదా. నీ మనస్సును శుద్ధి చేసుకోవటానికి ప్రయత్నం చెయ్యి. నా పట్ల ప్రేమ, భక్తి నేను చెప్పిన మాటయందు గౌరవం ఉంటే దానివలన నీవు నా స్వరూపాన్ని పొందుతావుగాని లోకంలో ఉన్న సపోర్టులను చూసుకొంటూ ఏదో నామకహా దేవుడు ఉన్నాడు అనుకొంటే, నీవు ఎవరిని సపోర్టు పెట్టుకొని జీవిస్తున్నావో తెలియకుండా ఉన్నానా నేను? శరీరానికి మరణం వస్తోంది అని కంగారుపడవద్దు. అదిపోతే ఇంకో శరీరం వస్తుంది. ఇప్పుడు ఉన్న శరీరాన్ని మేగ్జిమమ్ ఉపయోగించుకొని శరీరానికి మరణం రాకముందే నీ హృదయంలో ఉన్న మరణంలేని వస్తువును పొందు. బ్రహ్మంలో నుండి లోకం వచ్చింది అని చెపుతూ ఉంటే ఇది అంతా నీ మనస్సుకు అలా అనిపిస్తోంది. మనస్సు నశిస్తే ఏమీలేదు అంటారు భగవాన్. దేహం చనిపోయిన తరువాత ఉండదు అని మనం అనుకొంటాము. కాని ఇప్పుడు కూడా దేహం లేదు అంటారు. అది కూడా నీ తలంపే. తలంపును విడిచిపెట్టి దేహం లేదు, పుట్టుక లేదు, మరణం లేదు. అన్నీ తలంపులే. తలంపులను విడిచిపెట్టేస్తే ఇంక విడిచిపెట్టటానికి ఏముంది? తాడు నీకు పాముగా కనిపిస్తోంది అనుకో తాడులో నుండి పాము రాలేదు, నీ చూపుకు తాడు పాములాగ కనిపిస్తోంది. అది నీ చూపులో దోషం. అలాగే బ్రహ్మంలోనుండి లోకం రాలేదు. బ్రహ్మమే నీకు లోకంలాగ కనిపిస్తోంది. సరియైన వెలుతురు వచ్చినప్పుడు ఇది పాముకాదు, ఇది తాడే అని నీకు ఎలా తెలుస్తుందో అలాగే నీకు ఏ కారణం వలన బ్రహ్మం లోకంగా కనిపిస్తోందో ఆ కారణం నశిస్తే ఉన్న వస్తువు ఉన్నట్లుగా నీకు వ్యక్తమవుతుంది. అప్పుడు అంతా ఒక్కటే అని నీకు తెలుస్తుంది. మనం అంతా ఒక్కటే. కాని వేరుగా ఉన్నాము అని అనుకొంటున్నాము. ఇదే మాయ. ఈ చిల్లర గొడవలు ఎందుకు? ఇవి అన్నీ మనం కల్పించుకొన్నవే. మొదటి వస్తువును పట్టుకొంటే ఇంక ఏ గొడవ లేదు అన్నారు భగవాన్. మొదటి వస్తువు ఏది అంటే బ్రహ్మమే. మీకు గుణాలు రాకముందు, వికారాలు రాకముందు మీరు ఎలాగ ఉన్నారో, ఏదిగా ఉన్నారో దాని దగ్గరకు జరగండి, దానిని ఆశ్రయించండి, దానిని పట్టుకోండి దానిని పట్టుకొన్నాక ఇంక పొందవలసింది ఏదీ లేదు అని మీకు తెలుస్తుంది. జీవితంలో మనం చాలా మిస్ అయిపోతున్నాము. మన ప్రక్కన కృష్ణుడు ఉంటే లాభం ఏముంది? ఆయన చెప్పినది మనకు అర్థం కానప్పుడు ఆయన ప్రక్కనే ఉన్నా మనకు లాభం లేదు. సాధన అంటే ఏమీ లేదు ఆరోజుకారోజు దేహాభిమానాన్ని తగ్గించుకోవాలి. అదే సాధన. కృష్ణుడు ఏమి చెప్పాడు అంటే నీకు ఏదైనా విషయం వచ్చినప్పుడు అది నీవు అవునా, కాదా అని చూసుకో. మిగిలిన విషయాలు అన్నీ తీసి ఒక ప్రక్కన పెట్టు.

రోడ్డు మీద ఉన్న దుమ్ము అంతా పోగుచేసుకోవద్దు. నీకు సంతోషం వచ్చింది అనుకో, సంతోషం నీవా? ఒకవేళ నీకు దుఃఖం వచ్చింది అనుకో, దుఃఖం నీవా? నీకు అధికారం వచ్చింది అనుకో, అధికారం నీవా? అవి ఏమీ నీవు కాదు. అవినీవు కాదు అని నీకు అర్ధమయినప్పుడు నీకు దుఃఖం లేదు, ఏమీ లేదు. ఇప్పుడు బాహ్యంగా నీవు ఏది అనుభవించినా అది పరిణామంలో దుఃఖంగా మారిపోతుంది అని పరమాత్మ చెపుతున్నాడు. ఈ వాక్యాన్ని మనం మిస్అయిపోతున్నాము.

అంతా భగవంతుడే, అంతా ఒక్కటే, అంతా నీవే. అంతా నీవే అయినప్పుడు ఎవరిని చూసి ద్వేషిస్తావు? ఎవరికి అపకారం చేస్తావు అంటున్నాడు పరమాత్మ. అంతా మనమే అని భగవంతుడు చెప్పినమాట మనం తేలికగా చెప్పేసుకొంటున్నాము కాని అది మనకు అనుభవంలో లేదు. దానిని అనుభవంలోనికి తెచ్చుకోవాలి అనే పోరాటం ఏమీలేదు. దానిని అనుభవంలోనికి తెచ్చుకోవటానికి ప్రయత్నం చేస్తూ ఉంటే మనకు ఏ విషయాలు అయితే అడ్డు వస్తున్నాయో వాటిని బయటకు లాగి, కాల్చి బూడిద చేయాలి. శరీరం పుడుతుంది, పెరుగుతుంది, ముసలిదవుతుంది, చనిపోతుంది. ఇది అనివార్యం. నీవు దాని గురించి ఏడవవలసిన పనిలేదు. దేహానికి మరణం రావటం సహజం. ఇలా నీవు ఎంతకాలం ఏడుస్తావు. శరీరంలో ఉండగా అమృతానుభవం పొందటానికి ప్రయత్నం చెయ్యి. అది వదిలేసి చిల్లర గొడవలలోనికి వెళ్లటం ఎలా ఉంటుంది అంటే ఇంట్లో ఉన్న రూపాయి కాగితాలను పొయ్యిలో పెట్టి కాఫీకాచుకొన్నట్లుగా ఉంటుంది. ఇప్పుడు మనం గుణాల వడిలో ఉన్నాము. మీకు నా వడి కావాలి అనుకోండి ఆ గుణాలవడిలో నుండి బయటకు రాకుండా మీకు నావడి ఎలా దొరుకుతుంది అంటున్నాడు పరమాత్మ. గుణాలవడిలో నుండి బయటకురాము, నా వడికావాలి అంటే కుదరదు. గుణాల వడిలోనుండి బయటకు వస్తే మీరు నావడిలోనే ఉంటారు, నా స్వరూపాన్ని పొందుతారు అని భగవంతుడు చెపుతున్నాడు. లోకం ఉంది, విషయాలు ఉన్నాయి. నీకు ఒకోసారి సంతోషం వస్తుంది, ఒకోసారి దుఃఖం వస్తుంది, ఒకోసారి ధనం వస్తుంది. ఇవి అన్నీ వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. వచ్చేటప్పుడు ఎలా వస్తాయో మనకు తెలియదు, పోయేటప్పుడు ఎలా పోతాయో మనకు తెలియదు. అది దేహ ప్రారబ్దం. వాటి గొడవవద్దు. నీవు ఏదైతే కాదో వాటి గొడవ నీకు వద్దు అని భగవాన్ చెపుతున్నారు. కృష్ణుడు ఏమి చెపుతున్నాడు అంటే మీకు ధనం ఉంది అనుకోండి, విద్య ఉంది అనుకోండి, అధికారం ఉంది అనుకోండి. వాటిని ఎంజాయ్ చేస్తున్నారు కదా. అలాగే నేను చెప్పిన మాటలను కూడా ఎంజాయ్ చేయండి అంటున్నాడు పరమాత్మ. ఈ ఎంజాయ్‌మెంట్ ఆ ఎంజాయ్‌మెంట్‌ను తరిమేసి ఇది కూర్చొంటుంది. మనకు జ్ఞానం వస్తుందా, రాదా అనేమాట అటు ఉంచండి. అసలు జ్ఞానం రావటానికి తగిన వినయంగాని, సహృదయంగాని, పొందికగాని మనకు లేవు. మనకు వచ్చే తలంపుల విషయంలో, మాట్లాడే మాట విషయంలో, మన సాధనా విధానంలో మనం రైట్ డైరెక్షన్‌లో ఉన్నామా, రాంగ్ డైరెక్షన్‌లో ఉన్నామా అది చూసుకోవాలి. రాంగ్ డైరెక్షన్‌లో ఉంటే మనం స్పీడుగా వెళ్లినా గమ్యం చేరలేము, రైట్ డైరెక్షన్‌లో ఉంటే మనం నెమ్మదిగా వెళ్లినా గమ్యం చేరుకొంటాము, మోక్షానుభవం పొందుతాము. మనకు లోపల అశాంతి ఉంటుంది, పైకి శాంతిగా ఉన్నట్లు నటిస్తాము. లోపల గర్వం ఉంటుంది పైకి వినయంగా ఉన్నట్లు నటిస్తాము. ఇలా లోకాన్ని మోసం చేయగలముగాని భగవంతుడిని మోసం చేయలేము. మీ మనస్సుకు యజమాని ఈశ్వరుడు. మీ మనస్సును ఆయనకు తప్పించి ఎవరికి ఇచ్చినా మీకు భంగపాటు తప్పదు, వెలితి తప్పదు, అశాంతి తప్పదు, దుఃఖం తప్పదు. మీ ఇంట్లో పని మీరు చేసుకోండి. అందరితో కలసి ఉండండి, సేవ చేయండి. కాని వారు మనవాళ్లుకాదు, మనం అంతా ఈశ్వరుడు వాళ్లమే, మన ప్రభువు ఈశ్వరుడే, ఎప్పటికైనా మనం ఆయనను చేరుకోవాలి. అది గుర్తు పెట్టుకొని పనిచెయ్యండి. అంతేగాని ఎటుగాలి వేస్తే అటు వరిగిపోవద్దు. సాధన విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. సాధన అంటే పూజ ఒక్కటే కాదు, పరమాత్మలో ఐక్యమయ్యే వరకు మన మనస్సును నియమించుకొంటూ రావాలి. నరనారాయణులు తపస్సు చేసేటప్పుడు ఆ తపస్సును భంగం చేయమని ఇంద్రుడు అప్సరసలను పంపుతాడు. వారు అర్జునుడి దగ్గరకు వచ్చి నాట్యం చేస్తూ తపస్సు భంగం చేయటానికి చూస్తారు. అప్పుడు అర్జునుడు కళ్లు ఎర్రచేసి నా తపస్సు భంగం చేయటానికి వచ్చారా అని పెద్దకేక వేస్తాడు. అప్పుడు అప్సరసలు కృష్ణుడు దగ్గరకు వెళతారు. కృష్ణుడు ప్రశాంతంగా కళ్లు తెరచి మీరు అందంగా ఉన్నారు అని అనుకొంటున్నారు అని తన తొడను చరచి ఒక అప్సరసను సృష్టించి మీరు అందంగా ఉన్నారా, ఆమె అందంగా ఉందా చూసుకోండి అన్నాడు. మాకంటే అందమైన అప్సరసను సృష్టించిన మీ తపస్సు మేము ఏమి భంగం చేయగలము అని పరమాత్మ పాదాలను ఆశ్రయించి తరించారు. తపస్సు చెడగొట్టటానికే వచ్చినా, చెడ్డ పనికే వచ్చినా, పరమాత్మను ఆశ్రయించటం వలన తరించారు. కృష్ణుడు అంటే ఎవరు? ఆత్మ. ఆత్మలోనుండే అంత అందం వస్తే మరి ఆత్మ ఎంత అందంగా ఉంటుందో. లోకంలో ఉన్న వస్తుజాలం అంతా బ్రహ్మంలో నుండి వస్తున్నాయి. ఈ వస్తుజాలం ఇంత అందంగా ఉంటే మరి బ్రహ్మం ఎంత అందంగా ఉంటుందో? మనం ఏమి చేస్తున్నాము అంటే వస్తుజాలం యొక్క అందంలో పడి బ్రహ్మంను మర్చిపోతున్నాము.

రమణస్వామి ఏమి చెపుతున్నారు అంటే నీకు దేహము నేను అనే తలంపు ఉంది.

అదే నాయకుడు. అదే ఇతర తలంపులను లీడ్ చేస్తోంది. ఆ తలంపు వెనకాలే ఇతర తలంపులు అన్నీ వస్తున్నాయి. ఆ నాయకుడిని చంపేయండి, మిగతావారు అంతా చెల్లాచెదురై పోతారు. ఆకారాలు, వికారాలు, జన్మలు, మరణాలు ఇవి అన్నీ దేహము నేను అనే తలంపు బట్టే వస్తున్నాయి. దానిని తీసివేస్తే జన్మలు లేవు, మరణాలు లేవు, నీవు లేవు, నేను లేను, ఏమీ లేదు. మరి ఎవరూ లేకపోతే ఎలాగ అంటే ఉన్నదేదో ఉంది, వారు ఎవరో నీకు తెలియదు. వారు ఎలాగ ఉన్నారో అలాగ ఉన్నారు అంటారు భగవాన్. ఉద్యోగానికి రాజీనామా చేసి మీ సన్నిధిలో ఉండాలని ఉంది అని ఒక భక్తుడు భగవాన్‌ను అడిగాడు. భగవాన్ ఎప్పుడూ నీలోపలే ఉన్నాడు, నీకూడా ఉన్నాడు. ఉద్యోగం వదిలేసి ఎక్కడికి వెళతావు. భగవాన్ అంటే దేహం కాదు. భగవాన్ అంటే ఆత్మ. దాని స్వరూపమే ఆనందం, దాని స్వరూపమే జ్ఞానం. స్నేహితులను, బంధువులను, పరిసరాలను విడిచిపెట్టి పారిపోతే జ్ఞానం రాదు. నీవు ఎక్కడికి వెళ్ళినా నీ మనస్సు నీకూడానే ఉంటుంది. ఇలా పారిపోవటం త్యాగం అనుకొంటున్నావేమో అది త్యాగం కాదు. దాని వలన జ్ఞానం రాదు. మిగతా తలంపులన్నింటికి ఏమూలతలంపు అయితే నాయకత్వం వహిస్తోందో దానిని విడిచిపెట్టటమే త్యాగం, అదే సన్యాసం. అంతేగాని దేహాన్ని తీసుకొని వెళ్ళి ఎక్కడో పడవేస్తే అది త్యాగం అనుకోకు. బాహ్యంగా ఏదో విడిచిపెట్టటం వలన నీకు జ్ఞానం రాదు. మిగతా తలంపులను అన్నింటిని నేను అనే తలంపు లీడ్ చేస్తోంది. దానినే లీడింగ్ తాట్ అంటున్నారు. ఈ లీడింగ్ తాట్‌ను అట్టేపెట్టుకొని ఇల్లు వదిలేసినా, పొలంవదిలేసినా, డబ్బు వదిలేసినా నీవు ఏమీ వదలని వాడితో సమానము. ఇప్పుడు మనం కాశిపాడులో ఉన్నాము అనుకొంటున్నాము. దేహము నేను అనే తలంపు నశిస్తే ఇది నోటితో చెప్పటం కాదు, అనుభవంలో అది పోయింది అనుకో మనం ఈ సృష్టి అంతా వ్యాపించిపోతాము, ఎక్కడచూసినా మనమే ఉంటాము. అప్పుడు కళ్ళు తెరిస్తే ఆనందం, కళ్ళు మూస్తే ఆనందం, అంతా ఆనందమే. ఆస్థితిని మనం పొందాలి. నీవు ఎవరినో, ఏదో ఉద్ధరిస్తున్నాను అనుకోవద్దు, అలా అహంకారం పెట్టుకోవద్దు. అందరిని ఎవరైతే ఉద్ధరిస్తున్నారో, అందరి బాధ్యతలను ఎవరైతే భరిస్తున్నారో అట్టి ఈశ్వరుడితో రాజీపడు, ఆయన మాట విను, తరించు. లీడింగ్ తాట్ నశిస్తే మీ ప్రేమ విశ్వవ్యాప్తం అవుతుంది, ఆ ప్రేమకు సరిహద్దులు లేవు, జాతి, మత, కుల విచక్షణ లేకుండా లోకం అంతా ప్రేమను ఇవ్వటమే పని. ఇచ్చేకొలది ప్రేమ, జ్ఞానం పెరుగుతాయి, అది జ్ఞానం యొక్క వైభవం. కాశీకో, హిమాలయాలకో వెళితే నీకు లోచూపు వస్తుందా? రాదు. సత్పురుషులను ఆశ్రయించివారికి సేవచేసి, వారు చెప్పినది శ్రద్ధగా శ్రవణంచేసి, మననంచేసి, దానిని ఆచరించటం వలన నీకు లోచూపు కలుగుతుంది. మీ ఇంట్లో డబ్బు ఉండి, ఇతరులకు డబ్బు ఇవ్వగల శక్తి నీకు ఉండి, ఒక రూపాయికూడా ఇతరులకు ఇవ్వలేకపోతే అది ఇల్లు కాదు, అది స్మశానం అన్నారు శివానంద. ఒక వస్తువును ఇతరులకు ఇవ్వగల శక్తి నీకు ఉండి దానిని ఇతరులకు ఇవ్వకపోతే అది ఇల్లుకాదు, అది స్మశానం అక్కడ ఉన్నవారు మనుషులు కాదు, దెయ్యాలతో సమానం అని చెప్పటం.

మీరు ఎక్కడ ఉన్నా మీ మనస్సు పండాలి. మీ మనస్సు పక్వానికి వస్తే పండిన పండు ఎలా రాలిపోతుందో అలాగ మీరు సహజంగానే మాయలోనుండి విడిపోతారు. నీ దేహ ప్రారబ్దమును బట్టి నీవు ఎక్కడ ఉన్నా నీ మనస్సును పవిత్రం చేసుకో. అది ప్రధానం. నీ మనస్సును బాగు చేసుకొంటే పవిత్రమైన మనస్సు హృదయగుహలోనికి, ఈశ్వరుని కౌగిలిలోనికి నిన్ను తీసుకొని వెళ్ళి పరమాత్మలో ఐక్యం చేస్తుంది. నీ మనస్సును పాడుచేసుకొంటే మలిన మనస్సు నీ స్వరూపానికి నిన్ను దూరం చేసి చీకటి లోకాలకు తీసుకొనిపోతుంది. మీలో ఉన్న మంచిని, చెడును రెండూ వదిలేస్తే మిగిలేది ఆత్మే. మనం పుణ్యం చేస్తే భోగాలు అనుభవించవచ్చు అనుకొంటున్నాము. ఆ భోగాలు ఎక్కడనుండి వచ్చినవి, అవి ఆత్మలోనుండి వచ్చినవేకదా. అక్కడకు వెళ్ళు అంటున్నారు. మన మనస్సును బయటకు వెళ్ళకుండా కొట్టికొట్టి లోపలకు ఈడ్చుకొనిపోతున్నాడు. మనం అందరిని గౌరవించాలి కాని ఎవరినీ అగౌరవపర్చకూడదు. దానికికూడా ఈశ్వరుడు మార్కులు వేస్తాడు. ఇతరులను అగౌరవపరిస్తే ఈశ్వరుని కోపానికి గురి అవుతాము. మనం ఏదో రూపంతో, ఏదో నామంతో ఉన్నాము అనుకొన్నంతకాలం విగ్రహాలు మనలను ఆకర్షిస్తాయి. రూపాన్ని ఆరాధించటం, నామాన్ని స్మరించటం మనం పవిత్రులం అవ్వటానికే. మీకు ఏదైనా కష్టం వస్తే కంగారుపడకండి. భోగం వలన కంటే కష్టం వలన మీరు తొందరగా పవిత్రులు అయ్యే అవకాశం ఉంది. మీకు ఆకష్టం వచ్చింది అని ఈశ్వరుడికి తెలుసు. మిమ్మల్ని పవిత్రులను చేయటానికే కావాలని ఈశ్వరుడు ఆ కష్టాలను పంపాడు. ఆబాధను భరించండి. అప్పుడు రవ్వంత విచారణ చేస్తే మీకు అజ్ఞానం నశిస్తుంది.

నది వేగంగా ప్రవహిస్తూ ఉంటుంది, ఆగమంటే ఆగదు. సముద్రంలో కలిసే వరకూ అదే వేగంగా పోతుంది. అలాగే నీవు బ్రహ్మంలో ఐక్యం అయ్యేవరకూ వేగం విడిచిపెట్టకు. సన్యాసం అంటే తెల్ల బట్టలు విడిచిపెట్టేసి ఎర్ర బట్టలు వేసుకోవటంకాదు. సన్యాసం అంటే ఆ లీడర్‌ను చంపటం. ఆలీడర్ ఎవరు అంటే దేహము నేను అనే తలంపే లీడర్, దానిని చంపటమే నీ జీవిత గమ్యం.

# రమణభాస్కర

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, ది. 03-02-02, లక్కవరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భగవంతుడు అంతటా ఉన్నాడు, మన హృదయంలోనూ ఉన్నాడు, హృదయంలో ఉన్న వస్తువును దర్శించినవాడికి ఇదే అంతటా ఉంది అనే అనుభవం కలుగుతుంది. అప్పుడు రాకపోకలు ఉండవు, వాడికి పునర్జన్మ ఉండదు. ఎందుచేతనంటే వాడికి భేదదృష్టి నశిస్తుంది. భేదదృష్టి నశించిన వాడికి ఇంక పునర్జన్మ ఉండదు, అంతటా ఉన్న వస్తువు వాడికి అనుభవంలో ఉంటుంది. ఆస్థితికి మనం ఎదిగి వెళ్ళాలి. ఒక్కసారే మనం అంత ఎత్తుకు వెళ్ళలేము కాబట్టి భగవంతుని నామాన్ని స్మరిస్తూ, ఆయన రూపాన్ని ధ్యానిస్తూ నామరూపములకు అతీతమైన వస్తువును పొందమని మన పెద్దలు చెప్పారు. మీరు ఏ దేవుడిని ఆరాధించినప్పటికి అహంభావన నశించకుండా మీకు ఆత్మజ్ఞానం కలుగదు అని బాబా చెప్పారు. మనం అందరం చేస్తున్న పొరపాటు ఏమిటి అంటే మనం పొందవలసినది ఏమిటి అని మర్చిపోయి రాగద్వేషములకు లోనవుతున్నాము. మన మనస్సు క్షణక్షణానికి మారిపోతూ ఉంటుంది, ఆపాడుమనస్సును నేను అనుకొంటాము. ఒక విషయం గుర్తు పెట్టుకోండి. మనలోపల చిత్తశుద్ధి లేకుండా, లోపల మనం పవిత్రంగా లేకుండా ఏదో విచారణ చేస్తున్నాము, గంటల తరబడి ధ్యానం చేస్తున్నాము అంటే మీకు వచ్చేది సున్నా. జపం, ధ్యానం చేయవద్దు అని కాదు. అంతఃకరణశుద్ధి లేనప్పుడు, లోపల తోటి మానవుడి పట్ల ప్రేమలేనప్పుడు ఏదో ధ్యానం చేసాము, జపం చేసాము అంటే మీకు వచ్చేది సున్నా. వందలాది ప్రవచనాలు చేస్తున్నాము అవి ముఖ్యం కాదు. అంటేవాటికి విలువలేదు అని కాదు, అవి సెకండరీ. మీపట్ల నాకు ప్రేమ ఉందా, మీ క్షేమం నేను కోరుకొంటున్నానా, మీరు భౌతికంగా, ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావాలి అనే కాంక్ష నాకు ఉందా అనేది ముఖ్యం కాని నేను చెప్పే మాటలు అన్నీ సెకండరీ. ఒక మనిషికి విలువ కట్టేటప్పుడు వాడికి ఎంత ధనం ఉంది, ఎంత అధికారం ఉంది, వాడు పండితుడా అనేవి ప్రక్కనపెట్టి వాడికి తోటి మానవుడి మీద ఎంత ప్రేమ ఉంది అనేది చూడండి. ఆ ప్రేమలేనప్పుడు మిగతాగొడవలు ఎన్ని ఉన్నా అనవసరం. అవి సమాజానికి ఉపయోగపడవు. విద్య పెరిగేకొలది, ధనం పెరిగేకొలది బాధ్యతలు పెరగాలి. లేకపోతే ఆ ధనం, ఆవిద్య సమాజానికి ఉపయోగపడదు. ఎట్టిపరిస్థితులలోను మీ బుద్ధిని పాడుచేసుకోవద్దు. మీ బుద్ధి పాడైపోయే పరిస్థితులు అక్కడ ఉంటే అక్కడ నుండి దూరంగా వెళ్ళిపో. బుద్ధిపాడైతే ఆ మనిషి పూర్తిగా నశించిపోతాడు.

నేను ఏమీ దోషం చేయలేదు, పాపం చేయలేదు అయినా నాకు దుఃఖం వస్తోంది ఏమిటి అని ఒకరు బాబాను అడిగారు. నీవు ఈ జన్మలో చేసి ఉండకపోవచ్చు, పూర్వజన్మలో





పాపం చేసి ఉండవచ్చు. అందువలన దుఃఖం వస్తోంది అని చెప్పారు. మీరు చెప్పినది నిజమే అయినా ఇప్పుడు నేను మిమ్మల్ని ఆరాధిస్తున్నాను, మిమ్మల్ని విశ్వసిస్తున్నాను కదా మీ దయ వలన నాలోని దోషాలు పోవాలి కదా అని అడుగుతున్నాడు. నీ విశ్వాసం కనుక నిజమైతే నీవు చెప్పినట్లుగానే జరుగుతుంది అన్నారు బాబా. నీవు నోటితో బాబా దేవుడు అంటున్నావు, అలాగే నీ హృదయంలో బాబా దేవుడే అని పరిపూర్ణంగా విశ్వసిస్తే తప్పనిసరిగా నీలోని దోషాలు దహించబడతాయి. మనం కాలాన్ని పాడుచేసుకొంటున్నాము. మీ జీవితంలో ఒక్క క్షణం కూడా పాడుచేసుకోవద్దు అని ఉపనిషత్‌లో చెప్పారు. మనం ఏపని అయినా వయస్సులో ఉన్నప్పుడు చేయగలముగాని ముసలితనంలో ఏపని చేయలేము. కృష్ణుడు ఏమి చెప్పాడుఅంటే కనీసం మీప్రాణం పోయేటైములో అయిన నన్ను స్మరిస్తే సరిపోతుంది అన్నాడు. కృష్ణుడు చెప్పినది నిజమేకాని ఆమాటలు చూసి మనం మాయలో పడకూడదు. చిన్నవయస్సు నుండి భగవంతుని నామాన్ని స్మరిస్తూ ప్రాక్టీసు చేసినవాడికి అవసాన దశలో ఆ స్మరణ వస్తుందిగాని, మరణ సమయానికి ముందు ప్రాక్టీసు ప్రారంభించినవాడికి ఈ జన్మలో మోక్షంపొందే అవకాశం లేదు, అలా ప్రాక్టీసు ప్రారంభించటం కూడా మంచిదే. అలా ప్రాక్టీసు చేయటంవలన అది వచ్చే జన్మకు కలిసివస్తుంది. మీకు బాబా అంటే ఇష్టం అనుకోండి. బాబా నామాన్ని స్మరించుకోండి, ఆయన గురించి ఆలోచించండి, ఆయన మాటలను వినండి, ఆయన రూపాన్ని ధ్యానించుకోండి. మీ భక్తిని ప్రేమను కోరికలకు పరిమితం చేయవద్దు. అలాగని మీ కోరికలు నెరవేరవు అని కాదు. మన గురించి మనకంటే భగవంతుడికి ఎక్కువ తెలుసు. మనకు ఎప్పుడు ఏది ఇవ్వాలో ఆయనకు తెలుసు. భగవంతుడిని ఎప్పుడూ బలవంతం చేయకూడదు. మన ప్రభువు పట్ల ఎప్పుడూ అకారణ భక్తి ఉండాలి. మీరు రోజూ భగవంతుని నామాన్ని స్మరించుకోండి, ఆయన రూపాన్ని ధ్యానించుకోండి. మీరు రోజూ నీటితో శరీరానికి ఎలా స్నానం చేయిస్తున్నారో, ఆ నామస్మరణ, రూపధ్యానం మీ మనస్సును రోజూ స్నానం చేయిస్తుంది. అద్దం మీద మసి ఉంటే మన ముఖం సరిగా కనబడదు. అలాగే మన హృదయంలో భగవంతుడు ఉన్నప్పటికి మనస్సులో ఉన్న దోషముల వలన లోపల ఉన్న ఈశ్వరుడు మనకు తెలియటం లేదు. మనం అద్దాన్ని ఏవిధంగా అయితే గుడ్డతో తుడుస్తామో, అలాగే నామస్మరణ, రూపధ్యానం మనస్సులో ఉన్న దోషములను తొలగించి మనస్సును శుద్ధి చేస్తాయి. మనస్సు శుద్ధి అయితే, మనస్సు పవిత్రమైతే లోపల ఉన్న పరమేశ్వరుడు నీకు వ్యక్తమవుతాడు. ఇష్టాలు, అయిష్టాలు తగ్గించుకోండి. మీరు దేనిని పొందాలి అనుకొంటున్నారో దానిమీద ప్రేమలేకుండా, దానిని పొందాలి అనే జిజ్ఞాస లేకుండా మీరు దానిని పొందలేరు. నీవు ఆత్మగా ఉండి చెప్పినది కలకాలం నిలబడుతుంది గాని దేహంనేను అని చెప్పినది, మనస్సు నేను అని చెప్పినది నిలబడదు, ఇవి అన్నీ కాలప్రవాహంలో కొట్టుకొని పోతాయి.

గర్వంలేని విద్య, గర్వంలేని ధనం, గర్వంలేని కీర్తి నీకు సహకరిస్తాయి గాని వాటితోపాటు

గర్వం ఉంటే అది నీ పతనానికి దారి తీస్తుంది. నీకు ధనం ఉండి ఇతరులకు సహాయం చేయనప్పడు తరువాత జన్మలో నీకు దారిద్ర్యం వస్తుంది, ఆ దారిద్ర్యం నీచేత పాపం చేయిస్తుంది అని చెప్పారు. అందుచేత మీకు ధనం ఉంటే, విద్య ఉంటే వాటిని ఇతరుల యొక్క అభివృద్ధికి ఎంతో కొంత వినియోగించి కృషి చెయ్యి. అది నీకు ఉత్తమజన్మను కలుగజేస్తుంది, ఆత్మజ్ఞాన సముపార్జనకు అవకాశం ఉన్న జన్మ నీకు వస్తుంది. ఆత్మకానిదానిని ఆత్మ అనుకొని దానితో రాజీపడవద్దు. మనం ఫలానా దేహంలో ఉన్నాము, ఫలానా పేరు నాది అని అనుకోవటం వలన ఉద్రేకాలు వస్తున్నాయి. అది లేనప్పడు ఉద్రేకం రాదు. ఈశ్వరుడు ఉన్నాడు అనే దానిలో సందేహంవద్దు. మాటమాటకు సందేహం వస్తూ ఉంటే ఆ సందేహించేవాడు ఎవడు అని విచారణచేసి వాడిని తీసి ఒక ప్రక్కనపెట్టు. దేహము నేను అనే తలంపులోనుండే సందేహాలు వస్తాయి. దానిని తీసి ఒక ప్రక్కన పెడితే నీకు అమృతానుభవం కలుగుతుంది. ఈలోకం అంతా సంపాదిస్తావు అనుకో, నీవు లోపల కుళ్ళిపోతావు అనుకో నీవు సాధించినది ఏమిటి? నీవు ఎవరో నీవు తెలుసుకోకుండా లోకంలో ఏదో సాధిస్తావు అనుకో దానివలన నీకు వచ్చే ప్రయోజనం ఏముంది? ఎంతోకొంత జీవితంలో స్వార్థం లేకుండా పనిచేస్తూ ఉంటే మనలో ఉన్న మలదోషం పోతుంది, భగవంతుని ఉపాసించటంవలన విక్షేపదోషం పోతుంది. వీరు నావారు, వారు పరాయివారు అనే స్వపరబుద్ధి అంటే ఆవరణదోషం మోక్షం వచ్చాకపోతుంది. సత్యవస్తువు నీలోపలే ఉంది. రాగద్వేషములు నీ మనస్సును బాహ్యాముఖం చేస్తున్నాయి. నీవు ధ్యానం చేసి, విచారణ చేసి లోపలకు వెళ్ళటానికి ప్రయత్నం చెయ్యి. కాలు జారిపోతే ఎలా వెనక్కి తీసుకొంటామో అలాగ నీవు జపం చేసేటప్పడు తలంపు జారిపోతే దానిని వెనక్కి తీసుకోవాలి. జపం చెయ్యి, లోపల ఉన్న భగవంతుడు నీకు దొరికేవరకూ ప్రయత్నం చెయ్యి. భగవంతుడు తప్పించి ఈ మాటలు ఎవడుచెపుతాడు, ఆయన కరుణామయుడు. అసలు వస్తువు దొరికే వరకూ నీ ప్రయత్నం మానవద్దు. మధ్యలో ఏవైనా మహిమలు వచ్చినా అక్కడ ఆగిపోవద్దు, ప్రయత్నం మానవద్దు. నీకు సత్యానుభవం కావాలంటే లోపలకు వెళ్ళు. ప్రేమతో, ఇష్టంతో, ఏకాగ్రతతో ప్రయాణం చెయ్యి. నుయ్యి తవ్వుతూ ఉంటే ఒకోసారి రాయి అడ్డు వస్తుంది. రాయి అడ్డు వచ్చింది అని త్రవ్వటం మానివేస్తే నీరు పడదు. అలాగే నీ ప్రయత్నంలో కామక్రోధములు అడ్డువస్తాయి. అక్కడ ఆగిపోవద్దు. వాటిని కూడా తొలగించుకొంటే నీకు ఆత్మజలం దొరుకుతుంది. అంతఃకరణంలో ప్రేమ లేకుండా, శుద్ధి లేకుండా, రసహృదయం లేకుండా నీకు ఆత్మానుభవం కలుగదు. పూర్వజన్మలో కృషిచేసి ఉంటే ఈ జన్మలో తేలిక అవుతుంది. పూర్వజన్మలో ఏమీ సాధన చేయలేదు అనుకో, ఈ జన్మలోనే సాధన మొదలుపెడితే ఎక్కువ టైము పడుతుంది. ఇప్పడు ఎవరిలోనైనా అభివృద్ధి కనబడుతూ ఉంటే వారు పూర్వజన్మలో ఎంతో కృషిచేసి వచ్చి ఉంటారు, ఆకృషి నీకు కనబడదు. నీవు కొంత సాధనచేస్తే దాని తాలూక రుచి నీకు తెలుస్తుంది, నీవు కొంత లోపలకు వెళితే హృదయంలో ఉన్నశాంతి నీకు కొంచం కొంచంగా తెలుస్తుంది, అప్పడు నీకు ఆత్మ విశ్వాసం వస్తుంది, నీవు ముందుకు ప్రయాణం చేయగలవు. అసలు వస్తువును పొందేవరకు నీ ప్రయాణం ఆపవద్దు. మనలో ఉన్న దోషాలు మనకు కనబడవు, పరిశీలన ఉన్నవాడికి వాడిలో ఉన్న దోషాలు వాడికి తెలుస్తాయి. అందువలన వాచింగ్ అవసరము. నీ మనస్సులో ఏమి జరుగుతోందో చూసుకోవాలి. అది లేకుండా ఏదో విచారణ చేస్తున్నాను, ధ్యానం చేస్తున్నాను అంటే సరిపోదు. కొండెములు చెప్పేవారితో జాగ్రత్తగా ఉండండి, వారికి దూరంగా ఉండండి అని పరమాత్మ చెప్పాడు. ఎవరి ఇంట్లో గొడవో మీకు చెపుతున్నాడు అనుకోండి, మీరు శ్రద్ధగా వింటున్నారు అనుకోండి, మీ ఇంట్లో గొడవకూడా ఎక్కడో బయట చెపుతాడు అని మర్చిపోవద్దు. పూర్వజన్మలో ఉన్న అలవాటును బట్టి సహజంగా నీ మనస్సు బాహ్యాముఖానికి వచ్చేస్తుంది. ఇప్పడు నీవు సాధనచేస్తే, అభ్యాసం చేస్తే అంతసహజంగా నీ మనస్సు లోపలకు వెళుతుంది. అభ్యాసం కూసువిద్య అంటారు నీవు ప్రయత్నం చెయ్యి. అభ్యాసం వలన, వైరాగ్యం వలన నీకు మనోనిగ్రహం కలుగుతుంది, మనోనిగ్రహం అత్యంత ప్రధానమైనది. అభ్యాసం వలన వివేకం, ఏకాగ్రత పెంచుకోవచ్చు. కొంతమంది ఏమంటారు అంటే మాకు పుట్టుకతో రాలేదు అంటారు. అలాగని వూరుకోవద్దు, నీవు కృషి చెయ్యి. ఏదైనా పుట్టుకతో వచ్చిన వారికి కూడా పూర్వజన్మలో వారు ఎంతో కృషి చేసి ఉంటారు. కాలాన్ని పాడుచేసుకోవద్దు, ఒక్క క్షణాన్ని కూడా పాడుచేసుకోవద్దు. మరణం వచ్చే టైము దగ్గర పడుతోంది అంటే చాలా జాగ్రత్తగా ఉంటాము అలా జీవితం పొడుగునా అంత జాగ్రత్తగా ఉంటే మనకు యోగం సిద్ధిస్తుంది.

నీవు దైవాన్ని తెలుసుకొనే ప్రయత్నం మొదలుపెట్టు, ఆ ప్రయత్నంలోనే మనస్సు నశిస్తుంది. మాట్లాడితే దేవుని గురించి మాట్లాడు, స్మరిస్తే ఆయననే స్మరించు, ఆయన గురించే ఆలోచించు ఆప్రయత్నంలో నీ మనస్సు పవిత్రమవుతుంది. కష్టాలు వస్తున్నాయి, తట్టుకోలేకపోతున్నాము అని కూర్చోవద్దు. ఈశ్వరుడిని స్మరించండి, ఈశ్వరుడిని ధ్యానించండి ఆ కష్టాలు తట్టుకొనే శక్తిని ఆయనే ప్రసాదిస్తాడు. నిన్ను అనుగ్రహించి వాటినుండి విడుదల చేస్తాడు. ఈశ్వరుని పాదాలను విడిచిపెట్టవద్దు. ఆపాదాలే జీవుడికి గతి. ఏదో డబ్బు ఉంది, గౌరవం ఉంది అని ఆయన పాదాలను విడిచిపెట్టవద్దు. అటువంటి చిల్లర గొడవలలోనికి వెళ్ళవద్దు. నీకు కావలసింది మోక్షం, ఈశ్వరుని పాదాలను ఆశ్రయిస్తే అది నీకు దొరుకుతుంది. ఈశ్వరుని పాదాలను విడిచిపెట్టవద్దు, అందులో అజాగ్రత్త పనికిరాదు. ఈశ్వరుడికి భిన్నంగా ఎవడైనా ఉన్నాడని నీకు అనిపిస్తే వాడిని తీసి ఒక ప్రక్కనపెట్టు, అదే యోగం. భగవంతుని రూపాన్ని ఆశ్రయించు అదే నిన్ను లోపల ఉన్న ఈశ్వరుని దగ్గరకు చేరుస్తుంది. బయట ఉన్న దేవునికి నీవు చేసే పూజలు, జపాలు అవి నీవు ఫలకాంక్ష లేకుండా చేస్తే అవే నిన్ను లోపల ఉన్న దేవుని దగ్గరకు చేరుస్తాయి.

**రమణ భాస్కర**

05-03-2002

# రమణభాస్కర

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, ది. 17-02-02, పోడూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనకు వచ్చే తలంపుల విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. తలంపును బట్టే మాటలు వస్తాయి, తలంపును బట్టే పనిచేస్తాము కాబట్టి తలంపుల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. నీ మనస్సును ఒక ప్రక్కన పెట్టి, నీకు ఉన్న రాగద్వేషములను ఒక ప్రక్కన పెట్టి ఈశ్వరుడు ఎలా చెపితే మనం అలా వింటే, ఆయన చెప్పినట్లుగా నడుచుకొంటే, ఈశ్వరుడు చెప్పినట్లుగా దైనందిన జీవితంలో మన ప్రవర్తన ఉంటే ఆయన స్వరూపం మనకు ఇస్తాడు. అదే ఆత్మజ్ఞానం. మనం అందరం ఒక ప్రక్క అజ్ఞానం తొలగించుకోవటానికి ప్రయత్నం చేస్తూ, రెండోప్రక్క జ్ఞానం సంపాదించటానికి ప్రయత్నం చేయాలి. అజ్ఞానంలో దుఃఖం ఉంది, చీకటి ఉంది, విషాదం ఉంది. కాని జ్ఞానంలో శాంతి ఉంది, ఆనందం ఉంది, వెలుతురు ఉంది. అరచేతిలో ఉన్న వస్తువును మనం ఎంత స్పష్టంగా చూడగలమో మనకు జ్ఞానం ఉంటే హృదయంలో ఉన్న వస్తువు అంత స్పష్టంగా మనకు గోచరిస్తుంది. భగవంతుడి గురించి వింటే సరిపోదు, ఆయన గురించి వ్రాస్తే సరిపోదు, ఆయన గురించి మాట్లాడితే సరిపోదు, ఆయన మీద ఇష్టం ఉంటే సరిపోదు ఆయనను అనుభవంలోనికి తెచ్చుకోవాలి. అప్పుడు పని పూర్తి అవుతుంది. మనం చెడిపోవటానికి లోకంలో అనేక ఆకర్షణలు ఉన్నాయి. ఈ ఆకర్షణలకు లోనై మనం చెడిపోతున్నామా, లేక ఆకర్షణలకు ఎదురీది ఆయనను చేరుకొంటామా అని భగవంతుడు చూస్తూ ఉంటాడు. మనకు చేతులు ఉండి ఈతవస్తే ఏరుకి ఎదురుఈదవచ్చు. అలాగే మనకు సాధనాబలం ఉంటే, వినయం ఉంటే మనోప్రవాహానికి ఎదురుఈదవచ్చు. మనో ప్రవాహానికి ఎదురుఈదితే మనోమూలంలోనికి వెళ్ళి చైతన్యంలో ఐక్యమవుతాము, అదే మోక్షం.

సంసారంలో ఉన్న కష్టాల గురించి అందరూ ఎక్కువగా చెపుతూ ఉంటారు. సంసారం అన్నాక బాధలు వస్తూ ఉంటాయి. ఎన్ని బాధలు ఉన్నా ఇబ్బంది లేదు. భగవంతుడికి శరణాగతి పొందిన వాడిని భగవంతుడు పంపే కష్టాలు ఏమీ చేయలేవు. ఈశ్వరుడిపట్ల శరణాగతి ఉంటే మీ మనస్సు చల్లబడిపోతుంది. ఈశ్వరుడు ఉన్నాడు అని సజీవమైన విశ్వాసం మనకు ఉండాలి. మనకు వచ్చిన కష్టాలు ఈశ్వరుడికి తెలియకుండా రావటంలేదు. మన శరీరం మరణించినప్పుడు కూడా అది ఈశ్వరుడికి తెలియకుండా మరణించదు. అందువలన మనకు ఏదైనా సంఘటన జరిగితే మనవైపు నుండి ఆసంఘటనను చూడవద్దు. ఈశ్వరుడి వైపునుండి ఆ సంఘటనను చూడాలి. మీకు లాభం రానివ్వండి, నష్టం రానివ్వండి ఏది వచ్చినా మీ వైపునుండి ఆ సంఘటనను చూడవద్దు. ఈశ్వరుడు ఆ సంఘటనను ఎందుకు అక్కడ క్రియేట్ చేసాడు అని ఈశ్వరుడు కళ్ళు పెట్టుకొని దానిని చూడండి అంతేగాని మీ కళ్ళతో చూడవద్దు. అప్పుడు సమస్య మీకు అర్థమవుతుంది. మీ కళ్ళతో చూస్తే ఏమీ తెలియదు. ఈ జీవుడు ఎంత? వాడికి ఉన్న తెలివి ఎంత? అందువలన మీ కుటుంబంలోగాని, సమాజంలోగాని ఏదైనా సంఘటన జరిగితే దానిని మీ కళ్ళతో చూడవద్దు, ఈశ్వరుడు ఆ సంఘటనను ఎలా చూస్తాడో అలా చూడండి. మన కళ్ళతో చూస్తే దుఃఖం వస్తుంది, భయం వస్తుంది. ఆయన కళ్ళతో చూస్తే అంతా ఆనందమే, మీరు భయరహితులు అవుతారు. అందుచేత మీవైపు నుండి చూడవద్దు. ఆత్మవైపు నుండి చూడండి. ఆత్మవైపు నుండి చూస్తే ఆత్మ విశ్వాసం కలుగుతుంది. ఆత్మ విశ్వాసం లేకుండా ఆత్మానుగ్రహం కలుగదు. ఆత్మానుగ్రహం లేకుండా ఆత్మజ్ఞానం కలుగదు. భగవంతుడిని నిరంతరం జ్ఞాపకం పెట్టుకోండి. రాత్రి పడుకొనే ముందు, ఉదయం మేల్కొన్నప్పుడు, నీవు ఒంటరిగా కూర్చొన్నప్పుడు కూడా నేను ఒక్కడినే లేను నాకు జతగా ఈశ్వరుడు ఉన్నాడు, నా రక్షకుడు ఎప్పుడూ నాకూడానే ఉన్నాడు, నాకు నీడగా ఉన్నాడు అనే విషయం మర్చిపోవద్దు. అయితే దురదృష్టం ఏమిటి అంటే నోటితో ఈశ్వరుడు ఉన్నాడు అని చెపుతున్నాము, మనస్సులో నమ్మటం లేదు. నీకు వచ్చే సంఘటనలను నీకు ఆత్మానుభవం కలగటానికి నిన్ను ప్రిపేర్ చేయటానికి ఈశ్వరుడు ఆ సంఘటనలను క్రియేట్ చేస్తున్నాడు అని నీకు తెలిస్తే, నీ కళ్ళతో కాకుండా ఆయన కళ్ళతో ఆ సంఘటనలను చూస్తే అంతా ఆనందమే. ఈ మధ్య ఒక భక్తుడికి తల నొప్పి వచ్చింది. ఆయన స్నేహితుడు ఏమి అన్నాడు అంటే ఈ సృష్టి అంతా స్వప్నమే అని చెపుతున్నావు కదా మరి ఈ తలనొప్పి ఏమిటి? ఇది కూడా స్వప్నమేనా అని అడిగాడు. ఆ భక్తుడు ఏమి చెప్పాడు అంటే ఈ సృష్టి అంతా స్వప్నమే, నాకు వచ్చిన తలనొప్పికూడా స్వప్నమే అయితే ఇది బాధాకరమైన స్వప్నం అన్నాడు.

నీ హృదయంలో ఒక చావులేని వస్తువు ఉంది, అది నీవై ఉన్నావు అని రిపీటెడ్‌గా

భగవంతుడు చెపుతున్నాడు. మనం ఏ వస్తువు అయితే అయిఉన్నామని భగవంతుడు చెపుతున్నాడో ఆ వస్తువుగా మనం జీవిస్తున్నామా, లేక దేహంగా జీవిస్తున్నామా అని మనం చూసుకోవాలి. మనం ఆత్మగా జీవించటంలేదు, దేహంగా జీవిస్తున్నాము. కొంతమందికి ఎప్పుడూ దేహం గొడవే, ఆ దేహానికి ఏ సదుపాయాలు కావాలి అని చూసుకొంటారు. అంటేవారు ఎప్పుడూ దేహంగా జీవిస్తున్నారు. కొంతమంది వారిని పొగిడితే పొంగిపోతారు, విమర్శిస్తే కృంగిపోతారు అంటే వారు మనస్సుగా జీవిస్తున్నారు. ఇంకా కొంతమంది ఉంటారు వారు శరీరంగా జీవించరు, మనస్సుగా జీవించరు కానీ బుద్ధిగా జీవిస్తారు. వారి తెలివితేటలు పెంచుకొంటారు. వారు ఉద్రేకపడరు. లాభం వస్తుంది అంటే మాట్లాడతారు లేకపోతే మాట్లాడరు. అలా తెలివిగా జీవిస్తారు. అంటే బుద్ధిగా జీవిస్తున్నారు అని అర్థం. ఇలా దేహంగా, మనస్సుగా, బుద్ధిగా జీవించేవారికి ఆత్మజ్ఞానం ఎలా కలుగుతుంది. తెలివి మంచిదేకాని ఆ తెలివి భగవదనుభవం పొందటానికి నీకు సహకరించాలి. మనం సమాజానికి ప్రేమను పంచిపెడుతున్నామా, ద్వేషాన్ని పంచిపెడుతున్నామా అని దేవుడు చూస్తూ ఉంటాడు. ఏదో ఉపన్యాసాలు చెపుతున్నాము, పుస్తకాలు వ్రాస్తున్నాము అది కాదు సమాజంపట్ల మన ప్రవర్తన ఎలా ఉంది అని భగవంతుడు చూస్తాడు. మనం సమాజానికి ప్రేమను ఇవ్వాలిగాని ద్వేషాన్ని పంచిపెట్టకూడదు. ఈ గొడవలు అన్నీ ఎందుకు అని మీరు అనుకోవచ్చు. అలాకాదు మీ ప్రవర్తనను చూసి భగవంతుడు మార్కులు వేస్తాడు. ఈ మాటలు అన్నీ మిమ్మల్ని దేవుడి గుడికికాదు, దేవుని గుమ్మంలోనికి కాదు, దేవుని హృదయంలోనికి చేరుస్తాయి. నీవు ఏదైనా చేస్తే అది ఇతరులకు ఉపయోగపడేలా ఉండాలి. ఆపని వలన ఇతరులకు ఉపకారం జరగదు అనుకొన్నప్పుడు అటువంటి పనులు చేయకూడదు. శరీరంగా, మనస్సుగా, బుద్ధిగా జీవిస్తున్నంతకాలం మనకు ఆత్మజ్ఞానం కలుగదు. ఆత్మగా ఉండి ఆత్మగా జీవిస్తూ ఉంటే, అఖండ భావనతో జీవిస్తూ ఉంటే ఆత్మజ్ఞానం కలుగుతుంది, ఆత్మశాంతి ఈజన్మలోనే, ఇప్పుడే మీకు దొరుకుతుంది. అయితే మనం ఎలా జీవిస్తున్నాము అని ఎవరికి వారు ఆలోచించుకోవాలి. శరీరంగా జీవిస్తున్నామా, మనస్సుగా జీవిస్తున్నామా, బుద్ధిగా జీవిస్తున్నామా లేక ఆత్మభావనతో, చైతన్యభావనతో జీవిస్తున్నామా అని ఎవరికి వారు చూసుకోవాలి. చైతన్యభావంతో జీవించకపోతే నీకు చైతన్యానుభవం కలుగదు.

నాకు ఈ మధ్య కొంచం దుఃఖంగా ఉంటోంది. అది పోవటం ఎలాగ అని అడుగుతున్నారు. దుఃఖానికి రూపు ఉందా? దానికి రూపం లేదు. నీవు అనుకొన్నట్లు జరిగితే సంతోషం, అలా జరగకపోతే దుఃఖం. అంతకంటే దుఃఖం ఎక్కడ ఉంది అంటున్నారు భగవాన్. నీకు ఇష్టమైన తలంపు సంతోషాన్ని ఇస్తుంది, ఇష్టంలేని తలంపు దుఃఖాన్ని తీసుకొని వస్తుంది. ఇష్టంలేని తలంపును నిగ్రహించుకొనే శక్తి నీకు వస్తే అది నీకు దుఃఖాన్ని తీసుకొని రాలేదు. మనలను ద్వేషించే వారు మన ఇంటికి వచ్చారు అనుకోండి. వీరికి మనం అంటే ఇష్టంలేదు, వీరు మనలను ద్వేషిస్తున్నారు అనుకొంటే అప్పుడు దుఃఖం వస్తుంది. వారు మనలను ద్వేషిస్తున్నారు అనే తలంపు లేకపోతే ఇంక మనకు దుఃఖం రాదు. అది నేర్చుకోవాలి. అరుణాచలంలో ఒక 90 సం॥ల భక్తుడు వచ్చాడు. 90 సం॥ల నుండి హృదయం అనే గిన్నె ఖాళీగా ఉంది. 90 సం॥లు తరువాత ఈ గిన్నెను మీరు అమృతంతో నింపారు అన్నాడు. ఆత్మానందం గురించి పుస్తకాలలో చదివాను. ఇప్పుడు అది మీ సమక్షంలో అనుభవంలోనికి వచ్చింది. నాపని పూర్తి అయ్యింది అన్నాడు. నన్ను నిమిత్త మాత్రంగా పెట్టుకొని మీ హృదయాన్ని అమృతంతో నింపినది భగవంతుడే అని చెప్పాను. మీకు నేను ఏమీ ఇవ్వలేను కాని ఒకటి మాత్రం ఇవ్వగలను, నా భ్రాంతిని మీకు ఇవ్వగలను అన్నాడు. భ్రాంతి పోతే అంతా బ్రహ్మమయమే, వాడు చీకటినుండి బయటకు వచ్చేస్తాడు. దుఃఖానికి సంబంధించిన తలంపు వచ్చినా దానిని నిగ్రహించుకొనే శక్తి నీకు ఉంటే అది నిన్ను ఏమీ చేయలేదు. అయితే నిగ్రహించుకొనే శక్తి ఉండాలి కదా అని అడుగుతున్నాడు. ఈశ్వరుడిని ధ్యానించటం వలన శక్తి వస్తుంది. మనం ఎవరికైనా శాంతిని, జ్ఞానాన్ని ఇవ్వాలిగాని అజ్ఞానాన్ని ఇవ్వకూడదు. కొంతమంది భయకారణం లేకుండా భయపడతారు. ఒకవేళ భయకారణం ఉంది అనుకో ఈశ్వరుడిని ధ్యానించటం వలన, ఈశ్వరుడిని నిరంతరం స్మరించటం వలన నీకు శక్తి కలుగుతుంది. అప్పుడు భయకారణం ఉన్నా అది నిన్ను భయపెట్టదు. నిరంతరం భగవంతుని స్మరించాలి అంటే నేను ఏదో దేవుని పేరు చేసుకోవాలి కదా అంటున్నాడు. ఏదో దేవుని నామం చేసుకోండి. అది యాంత్రికంగా చేయవద్దు, పూర్తిగా ఇష్టంతో, ప్రేమతో చేయాలి. నీవు ఇప్పుడు దుఃఖ పడుతున్నావు. ఇంకో గంటలో నిద్రలోనికి వెళ్ళిపోతావు. అక్కడ నీకు దుఃఖం లేదు. మరి నిద్రలో ఆ దుఃఖం అంతా ఎక్కడికి పోతోంది. పగలు ఉన్న వ్యక్తి, రాత్రి ఉన్న వ్యక్తి వేరుకాదు కదా. పగలు దేహము నేను అనే తలంపు వలన నీకు దుఃఖం వస్తోంది. నీవు నిద్రలో బ్రహ్మమే. జాగ్రదవస్థలో కూడా నీవు బ్రహ్మమే. అన్ని అవస్థలలో కూడా నీవు

బ్రహ్మమే. మరి నిద్రలో లేని దుఃఖం జాగ్రదవస్థలో ఎందుకు వస్తోంది అంటే దేహము నేను అనే తలంపు నుండి వస్తోంది. అక్కరలేని తలంపులు వస్తే వాటిని నిరోధించటానికి నేను నామం చేసుకొంటాను అంటే భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే జపం గట్టిగా చేయవచ్చు, నెమ్మదిగా చేయవచ్చు. కాని నీవు చేసే నామం మీద నీకు గౌరవం ఉండాలి. ఆ నామమే బ్రహ్మం అనుకోవాలి. నారాయణ అనేటప్పటికి నీకు బ్రహ్మమే స్ఫురించాలి. నీవు భగవంతుడిని స్మరించుకొంటున్నావు అనుకో అప్పడు నీకు ఇష్టంలేని తలంపులను పంపిస్తాడు. వాటిని నీవు తట్టుకొంటున్నావా, లేదా, నీకు ఎంత వరకు బలం ఉంది, ఎంతవరకు ప్రిపరేషన్ ఉంది అని భగవంతుడు చూస్తూ ఉంటాడు. మనకు ఏ కారణంవలన గర్వం వచ్చినా ఆ క్షణం నుండి మన పతనం ప్రారంభమవుతుంది, అదఃపాతాళానికి కొట్టుకొనిపోతాము. ఈ మధ్య కాకినాడలో ఒక అమ్మగారు ఆవిడ భర్త గురించి గొప్పగా చెపుతున్నారు. ఆయన చనిపోయి సంవత్సరం అయింది అయినా ఆవిడ భర్త మంచివాడు అని చెప్పటం మానలేదు. వచ్చిన వారికందరికి భర్త మంచితనం గురించి చెపుతున్నారు, ఆతాదాప్యం పోవటం లేదు. అలా తాదాప్యం చెందటం వలన ఆవిడకు గర్వం వచ్చేస్తోంది, అది ఆవిడకు తెలియటం లేదు. పూర్వ పుణ్యం వలన మంచి భర్త దొరికాడు. భర్త మంచివాడు, మంచివాడు అని అస్తమాను అనుకొంటే ఆవిడకు కలిసివచ్చేది ఏమిటి? సాధన చేసుకోవటం మానివేసి ఈ గోల ఏమిటి? ఇలాంటి తలంపులతో కాలాన్ని వృథా చేసుకొంటాము, అసలు గోల్ మిస్అయిపోతాము.

ఏదో రోజున చనిపోతాను కదా. నేను పుణ్యం చేసాను, పాపం చేసాను. ముందు పుణ్యం వస్తుందా లేక ముందు పాపం వస్తుందా అని అడుగుతున్నాడు. భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే ఎందుకు వచ్చిన గోల ఇదంతా, ఎప్పడో చనిపోయాక గొడవ నీకు ఎందుకు? ఇప్పడు జీవించే ఉన్నావు కదా. నీవు ఎవరో నీవు తెలుసుకో. నీవు ఆత్మవు. ఆత్మకు చావుపుట్టుకలు లేవు. నీవు అసలు పుట్టలేదు. దేహం పుడుతుంది, పెరుగుతుంది, మరణిస్తుంది. ఈ చావు పుట్టుకలు, పుణ్యఫలం, పాపఫలం అనుభవించటం ఇదంతా కలిపి దానిని ముద్దచేస్తే అదే యజ్ఞం. ఈ యజ్ఞం నిరంతరం జరుగుతూ ఉంటుంది. వీటి అన్నింటికి నీవు అతీతుడవు. నీవు బ్రహ్మమే. బ్రహ్మంకు చావు పుట్టుకలు లేవు. అది ధర్మానికి అధర్మానికి అతీతం, పుణ్యానికి పాపానికి అతీతం, న్యాయానికి అన్యాయానికి అతీతం. బ్రహ్మం వీటి అన్నింటికి అతీతం. అక్కడకు వెళ్ళు. నీవు అక్కడకు వెళ్ళలేదు అనుకో ఈ యజ్ఞంలో తిరుగుతూ





ఉండవలసిందే. జీవితంలో నీవు అనుభవించే భోగాలు అన్నీ చివరకు విసుగు కలిగిస్తాయి. నీవు బ్రహ్మం దగ్గరకు వెళ్ళు. అది వీటికన్నింటికీ అతీతం.

నీకు బ్రహ్మానుభవం కలిగే వరకూ ఏదో సందేహాలు నిన్ను పీడిస్తూనే ఉంటాయి. నీకు పుణ్యబలం లేకపోతే, పూర్వజన్మలో సత్కర్మ చేసి ఉండకపోతే సందేహాలు ఇంకా పెరిగిపోతాయి. బ్రహ్మానుభవం కలిగేవరకు నీవు, నేను అనే భిన్నత్వం పోదు. భిన్నత్వం ఉన్నప్పడు రాగద్వేషములు వస్తూ ఉంటాయి. భిన్నత్వమును నెమ్మదిగా తగ్గించుకొంటూ రావాలి. భిన్నత్వం పూర్తిగా నశిస్తే నీవు బ్రహ్మంలో ఐక్యమవుతావు. బ్రహ్మానుభవం పొందినప్పడు నీవు కాలాతీతుడవు, కామాతీతుడవు అవుతావు. నేను ధ్యానం చేస్తున్నాను, నాకు ధ్యానం కుదరటం లేదు అంటే మనస్సునిండా కోరికలు పెట్టుకొని ధ్యానంలో కూర్చొంటే ధ్యానం ఎలా కుదురుతుంది అంటున్నారు. దానికి కొంత శిక్షణ ఉండాలి, త్యాగబుద్ధి ఉండాలి, పూర్వజన్మలలో కొంత సత్కర్మ చేసి ఉంటే ఇప్పడు ధ్యానం కుదురుతుంది. ధ్యానం మంచిదే. ధ్యానం వలన ముందుచూపు, లోచూపు వస్తాయి. ముందుచూపువలన లోకయాత్ర బాగా జరిగిపోతుంది, లోచూపు వలన ఆత్మజ్ఞానం కలుగుతుంది. నీకంటే ఎక్కువ చైతన్యస్థాయి ఉన్నవారితో సహవాసం వలన ధ్యానస్థితి పెరుగుతుంది. అసలు వస్తువును పట్టుకో. అప్పడు ఈ కాల చక్రాన్ని దాటిపోతావు. పుణ్యాలు, పాపాలు గొడవవద్దు. ఈ కాలప్రవాహంలో కొట్టుకొనిపోయే వాటి గొడవ నీకు వద్దు. దైనందిన జీవితంలో నీకు ఎటువంటి పరిస్థితులు ఎదురయినా వాటిని భగవంతుని ప్రసాదంగా స్వీకరించు, అంతేగాని నీవు ధ్యానంలో కూర్చొన్నా నీవు ధ్యానించేది భగవంతుడినికాదు, అమ్మాయి పెళ్ళి ఎప్పడు అవుతుందా అని ధ్యానిస్తావు. అమ్మాయి పెళ్ళి అయ్యాక దేవుడిని మర్చిపోతావు.

ఒక అమ్మగారు భగవాన్ దగ్గరకు వచ్చారు. చాలా మృదువుగా, నిశ్చయంగా, నిర్మలంగా మాట్లాడుతున్నారు. ఆవిడ ఏమి చెపుతున్నారు అంటే మిమ్మల్ని చూసే అవకాశం నాకు కలిగింది, రావాలంటే రాగలమా, వచ్చే అవకాశం వచ్చింది కాబట్టి వచ్చాము. రావటమేకాదు కళ్ళనిండుగా మిమ్మల్ని చూసుకొనే అవకాశం వచ్చింది. మా కళ్ళకు ఉన్న ఆకలి తీరిపోయింది. అంతేకాదు మీ మాటలు వినే అవకాశం కలిగింది. మా ఇంట్లో ఏమీ సమస్యలు లేవు, అన్నీ బాగానే ఉన్నాయి. సంపద సరిపడ ఉంది, ఏమీ లోటు లేదు. బాహ్యంగా చూస్తే నాకు అన్నీ ఉన్నాయి, ఏమీలోటు లేదు కాని లోపల శాంతి లేదు, అన్నీ ఉన్నాయి కాని శాంతి లేదు. శాంతి రాకుండా

ఏదో నన్ను అడ్డుకొంటోంది దానిని తొలగిస్తారు అని వచ్చాను అని చెప్పారు. భగవాన్ కొంతసేపు మౌనంగా ఉన్నారు. తరువాత సహజంగా మాట్లాడుతూ సరి అన్నారు అంటే మీరు చెప్పినది విన్నాం అని. శాంతి కావాలి అంటున్నావు. శాంతి కావాలి అని నీలో ఎవరు అంటున్నారో ఆ నేనును ఈశ్వరుడికి అర్పణచెయ్యి వెంటనే శాంతి వచ్చేస్తుంది. ఆ నేనును ఈశ్వరుడికి అర్పించిన మరుక్షణంలో పరిస్థితులు అన్ని చక్కబడి, శాంతి వచ్చి నిన్ను వరిస్తుంది అన్నారు. నీ భారం ఈశ్వరుడి మీద వేయటం వలన అన్నీ చక్కబడతాయి. నీవు దైవం మీద భారం వేయగలిగితే ఆయన మోయటానికి సిద్ధంగానే ఉన్నాడు, నీవు వేయటానికి అనుమానిస్తున్నావు. నీ భారం అంతా ఆయన మీద వేస్తే ఆయన మోయగలడో, లేదో అనే సందేహం వద్దు. నీ బరువు అంతా ఆయన మోయగలడు. మేము కర్మ అనుభవిస్తున్నాము, మా విధి ఇలా ఉంది అని చాలామంది అంటారు. శరణాగతి పొందినవాడిని కర్మగాని, విధిగాని ఏమీ చేయలేవు. పూర్ణశరణాగతి చెందినప్పుడు ఇంక మనం నడవవలసిన పనిలేదు, ఆయన మనలను భుజాన వేసుకొంటాడు. అప్పుడు ఇంక పడిపోతాము అని భయం ఉండదు, ఆందోళన పడవలసిన పనిలేదు. అలాగని మన ప్రయాణం ఆగదు ఆయనే గమ్యానికి మోసుకొనిపోతాడు.

మనస్సును ఉద్రేక పరచవద్దు. లోపలకు వెళ్ళే ఆహారం విషయంలో, బయటకు వచ్చే మాటల విషయంలో జాగ్రత్తగా ఉండు. ఇవి అన్నీ కూడా నిన్ను శరణాగతికి సిద్ధం చేస్తాయి. అప్పుడు నీకు అశాంతిని తీసుకొని వచ్చే కారణాలు ఉన్నా అవి కనబడకుండా పోతాయి. భగవంతుడు నిన్ను ఆయన భుజాన వేసుకొన్నప్పుడు ఇంక నీకు సమస్యలు ఏమిటి? నీ సమస్యలే ఆయన సమస్యలు. ఇంక నీవు ఎక్కడ ఉన్నావు? మీరు చెప్పే మాటలు వినటానికి బాగానే ఉన్నాయి, సాధనకు ఎంతవరకు సహకరిస్తాయి, మీరు చెప్పిన పద్ధతిలో సాధన చేయగలమా అని అడుగుతోంది. శరణాగతిని ప్రాక్టీసు చేయటం అంటే నోటితో చెప్పినంత తేలికకాదు. శరణాగతిని ప్రాక్టీసుచేయటం అంటే మన మనస్సును కాల్చి బూడిద చేయటం, బ్రతికుండగానే చచ్చినవాడిలా బ్రతకటం. ఇంకా కొన్ని సంవత్సరాలు తరువాత ఎలాగ చనిపోతాము కదా ఇప్పుడే చనిపోయాము అనుకో అప్పుడు శరణాగతి సాధ్యం. శరణాగతి మొదటిలో కష్టమే. అది ప్రాక్టీసు అయ్యాక నీకు కష్టం అనిపించదు. ఇష్టం ఉన్నచోట కష్టం ఉండదు. మీకు ఆరోగ్యం బాగాలేదు అనుకోండి. మీకు బాగా సన్నిహితులు వచ్చారు అనుకోండి వెంటనే లేచి కూర్చొంటారు, వారి మీద ఉన్న ఇష్టం వలన మీ అనారోగ్యం అంతా మర్చిపోతారు.

05-03-2002



అలాగే భగవంతుని పట్ల ఇష్టం ఉంటే, ప్రీతి ఉంటే, ప్రేమ ఉంటే, ఆయనను పొందాలి అనే కాంక్ష ఉంటే సాధన తేలికగా జరిగిపోతుంది. భగవంతుని పట్ల ఇష్టం కుదిరితే సాధన నీకు కష్టం అనిపించదు. నీవు ఏమి చేయాలి అంటే నిన్ను నీవు అర్పించుకో. నిన్ను నీవు అర్పించుకొంటే మిగిలేది శాంతే. నీ ఇష్టమే నా ఇష్టం, నీ సంకల్పమే నా సంకల్పం అని అనుకోవాలి. ఆయన సంకల్పమే మన సంకల్పం అనుకొనే వరకు మనం పాపాలు చేయకుండా ఉండలేము. తల్లి మనస్సులో ఉన్నది కూతురుకు చెప్పదు. కూతురు మనస్సులో ఉన్నది తల్లికి చెప్పదు. ఎందుచేతనంటే మన సంకల్పాలు అన్నీ ఎక్కడ నుండి వస్తున్నాయి అంటే దేహము నేను అనే తలంపునుండి వస్తున్నాయి. దేవుని సంకల్పం ఎటువంటిది అంటే అది సత్య సంకల్పం అంటే సత్యంతో తాదాప్యం చెందటం వలన వచ్చే సంకల్పం. అందువలన నీ గొడవ వదిలివెయ్యి. ఆయన సంకల్పం నీ సంకల్పంగా చేసుకో. ప్రతీ మనిషి పాపి అంటే మనకు అందరకు దేహము నేను అనే తలంపు నుండే సంకల్పాలు వస్తున్నాయి, దేహము నేను అనే తలంపు నుండి వచ్చే సంకల్పాలు అన్నీ పాపాలే. దేహము నేను అనే తలంపు లేకుండా మీకు ఏవైనా సంకల్పాలు వస్తే అవి పుణ్యప్రదమే. మీకు ఎప్పుడైనా అటువంటి సంకల్పాలు వస్తున్నాయా? దేవుడి సంకల్పమే మీ సంకల్పం చేసుకోండి. దేవుడు చెప్పాడు కాబట్టి మీకు ఇష్టం ఉన్నా, లేకపోయినా దేవుడు చెప్పినట్లుగా చేయండి. మీ మనస్సు చెప్పినట్లు నడవవద్దు. దేవుడు చెప్పినట్లు నడవండి. మీ ఇష్టాలు ఒక ప్రక్కన పెట్టండి, దేవుని ఇష్టాన్ని మీ ఇష్టం చేసుకోండి. దేవుడు సంకల్పమే మీ సంకల్పం చేసుకొంటే అప్పుడు శరణాగతి సాధ్యమే. మీగతి అల్లా శరణాగతే. ఎప్పుడైతే శరణాగతి పూర్తి అయిందో ఉన్నది శాంతే, ఉన్నది ఆనందమే. మీ అహంకారము అనే చీకటి గోతిలోనుండి బయటకురండి. అప్పుడు దేవుడి వైభవం మీకు తెలుస్తుంది. స్మశానంకు వెళ్ళేవరకు దేహమే కేంద్రంగా, అహంకారమే కేంద్రంగా జీవించేవాడికి హృదయంలో ఉన్న వెలుగు ఎలా తెలుస్తుంది. స్వర్గరాజ్యం మీ హృదయంలో ఉన్నమాట నిజమే. అహంకారము నెత్తిమీద పెట్టుకొని తిరిగే నీకు స్వర్గరాజ్యం ఎలా గోచరిస్తుంది. అహంకారము అనే గొయ్యిలో నుండి బయటకురండి. దానిని పూడ్చటానికి చూడవద్దు, మీరు ఎంత పూడ్చినా అది పూడదు. దానిలో నుండి బయటకు రండి. అదే శరణాగతి. ఆకాశం ఎంత విశాలంగా ఉందో అంత విశాలంగా ఉండాలి, సముద్రం ఎంత లోతుగా ఉందో మన గుండె అంతలోతుగా ఉండాలి. వీటిని సాధించటానికి మనం సత్వగుణం ప్రాక్టీసు చేయాలి.

**రమణ భాస్కర**

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహ భాషణములు

| | | |
|---|---|---|
| 02-03-02 టు 09-03-02 | | హైదరాబాదు కేంపు |
| 12-03-02 | మంగళ | చించినాడ, శివరాత్రి శివాలయంవద్ద |
| 13-03-02 | బుధ | నేరేడుమిల్లి (పాలకొల్లు - దొడ్డిపట్ల రోడ్డు) |
| 17-03-02 | ఆది | జిన్నూరు, శ్రీరమణక్షేత్రం |
| 24-03-02 | ఆది | చిలుకూరు (వయా) భీమవరం |
| 27, 28-03-02 | బుధ, గురు | చించినాడ, గీతామందిరం |
| 30-03-02 | శని | జువ్వలపాలెం గీతామందిరం |

# రమణ భాస్కర

ఫారం 4 (రూలు 8)


1. ప్రచురణ స్థలము : **పాలకొల్లు**
2. ప్రచురణ కాలము : **పక్ష పత్రిక**
3. ప్రచురణ కర్తపేరు : **పి.ఎస్. రామరాజు**
4. భారతీయుడా? కాదా? : **భారతీయుడు**
5. చిరునామా : **లక్ష్మీ మోడరన్ రైస్ మిల్లు ఉల్లంపర్రు - పాలకొల్లు**
6. పబ్లిషర్ భారతీయుడా? కాదా? : **భారతీయుడు**
   చిరునామా : **పాలకొల్లు**
7. సంపాదకుడు భారతీయుడా? కాదా? : **భారతీయుడు**
8. పత్రిక యజమాన్యం : **పి.ఎస్. రామరాజు పబ్లిషర్ & ఎడిటర్**


## రమణ భాస్కర ప్రచురణల బైండులు

| | | |
|---|---|---|
| 1. | 1998-1999 | రు. 75/- |
| 2. | 1999-2000 | రు. 100/- |
| 3. | 2000-2001 | రు. 125/- |

నోట్ : పోస్టల్‌ద్వారా కావలసినవారు పోస్టల్ ఖర్చులుకూడా పంపించవలెను.

### చందాదారులకు గమనిక :

నూతన చందాదారులు, రెన్యువల్‌చేసే చందాదారులు చందా సొమ్మును ఎం.ఓ.ద్వారా పంపితే మీచందా వివరాలు నమోదు చేసుకొనబడును. ప్రతినెల మేము పంపించు మాసపత్రిక మీకు చేరకపోతే మీ అడ్రస్సు కూపన్ ప్రకారం పూర్తి డిటైల్స్‌తో వెంటనే మాకు తెలియజేయండి.

మీ చిరునామాలో మార్పుఉంటే దయచేసి వెంటనే మాకు తెలియజేయండి. అవిధముగా తెలియజేసినచో పత్రిక నేరుగా మి క్రొత్త చిరునామాకు వచ్చి చేరుతుంది. మాకు వ్రాసే ఉత్తరాలలో మీ చందా రశీదు నెంబరును తెలియపరచడం మరువకండి.

### రమణ భాస్కర పాఠకులకు మనవి

సద్గురు శ్రీ నాన్నగారి ప్రవచనాలను ది. 23-9-2001 (సద్గురు శ్రీ నాన్నగారి జన్మదినోత్సవం) నుండి సంవత్సర చందా రూ॥ 150/- లుగా నిర్ణయించడమైనది. మీరు చెల్లించిన సంవత్సర చందాకు ది. 23-9-2002 వరకు క్రమం తప్పకుండా ముద్రించిన పత్రికలు అందుతాయి. గమనించగలరు. మీరు యం.ఓ / డి.డి. / నగదు రూపంగా పంపించవలసిన చిరునామా :


**శ్రీ పి. శ్రీరామరాజు** ("రమణ భాస్కర" కొరకు)

శ్రీ రమణ క్షేత్రం, **జిన్నూరు - 534 265,** ప॥గో॥ జిల్లా, ఆంధ్రప్రదేశ్


కూపన్

ఎడిటర్ గారికి,

నేను రమణభాస్కర సంవత్సర చందా నిమిత్తం రూ॥150/-లు (అక్షరాలా నూటయాబది రూపాయలు మాత్రమే) యం.ఒ./డి.డి./నగదు పంపించుచున్నాను. క్రమం తప్పకుండా ప్రతులు పంపించగలరు. (ది. 23-9-2001 నుండి 22-9-2002 వరకు)

పేరు ..........................................................................................

తండ్రి / భర్త..........................................................................................

డోర్ నెం.......................................................వీధి/రోడ్ పేరు.......................................

గ్రామం.......................................................................పిన్ కోడ్ [ | | | | | ]

మండలం...................................జిల్లా......................................రాష్ట్రం...............................